క్లుప్తంగా

మంత్రి తుమ్మలకు వినతులు


సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి తుమ్మల

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రికి పలువురు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. సోమవారం ఉదయం సమస్యలపై మంత్రి తుమ్మలను కలవడానికి పలువురు రాగా, వారితో ఆయన మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తప్పకుండా సమస్యలు పరిష్కారిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్, కేవీ.దొడ్డా ప్రసాద్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ప్రతిభ


ప్రశంసాపత్రాలతో అనూష

అశ్వారావుపేటరూరల్: జిల్లా కేంద్రంలో ఇటీవలె నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడా పోటీల్లో అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం.అనూష ప్రతిభ కనబరించింది. ఈ మేరకు అండర్-14 విభాగంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో 100 మీటర్ల విభాగంలో తృతీయ స్థానం, 4'100 మీటర్లలో విభాగంలో ద్వితీయ స్థానం, 400 మీటర్లలో విభాగంలో తృతీయ స్థానాల్లో గెలుపొంది ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం నల్లపు కొండలరావు తెలిపారు. ఈ మేరకు పీఈటీ ఎం.పద్మజ, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

ఇసుక లారీలను నియంత్రించాలి

భద్రాచలంటౌన్: ఇసుక లారీలతో గోదావరి పరివాహక ప్రాంతంలో రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్రఇబ్బందులు పడుతున్నారని, ఇసుక లారీలను నియంత్రించి రోడ్ల మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సోమవారం టీటీడీపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్టని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు రహదారి ఇసుక లారీలతో పూర్తిగా ధ్వంసమవ్వడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అంబులెన్స్‌లు సైతం సమయానికి రోగులను ఆస్పత్రికి చేర్చకపోవడంతో ప్రాణాలు పోతున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇసుక లారీలను నియంత్రించి రోడ్లను మరమ్మతులు చేయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొడాలి శ్రీనివాసన్, కుంచాల రాజారాం, శ్రీనివాసరావు, తాళ్లూరి చిట్టిబాబు, చిరంజీవి, రమేష్, రవితేజ, సురేష్, రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

అశ్వాపురం: మండలపరిధిలోని గొల్లగూడెం చెరువు వద్ద నడిచి వెళ్తున్న వ్యక్తిని సోమవారం బైక్ ఢీ కొనడంతో ఆ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లగూడెం గ్రామానికి చెందిన మల్లేష్ నడచి వెళ్తున్న క్రమంలో మణుగూరు వైపు వెళ్తున్న టీఎస్ 28 ఎ 2026 నంబర్ గల బైక్ ఢీ కొనడంతో గాయాలపాలైన వ్యక్తిని స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం అశ్వాపురం పీహెచ్‌సీలో ఆటోలో తరలించారు.

ఎదురెదురుగా బైకులు ఢీకొని..

అశ్వాపురం మండలపరిధిలోని జగ్గారం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. ప్రధాన రహదారిపై రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొనడంతో గ్రామానికి చెందిన సింగమనేని నాగయ్యకు తీవ్రగాయాలు కాగా మరో వ్యక్తి కూడా గాయాలయ్యాయి. ఇద్దరిని 108లో మణుగూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అదుపుతప్పి లారీ బోల్తా



అశ్వారావుపేటరూరల్: చేపల లోడుతో వెళ్తున్న ఓ లారీ సోమవారం అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపూర్ నుంచి ఏపీలోని భీమవరానికి చేపల లోడుతో వెళ్తున్న లారీ అశ్వారావుపేటలోని భద్రాచలం మార్గంలో అదుపు తప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడగా, లారీ కొంత మేర ధ్వంసమైంది.

నాసిరకంగా.. కట్టేస్తున్నారు..!

- కొరవడుతున్న అధికారుల పర్యవేక్షణ
- రూ.లక్షల ప్రజాధనం వృథా..

నాణ్యత పాటించని కాంట్రాక్టర్లు


సీతారాంపురంలో పగిలిపోయిన ఇంటి పిల్లర్

అశ్వాపురం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కాంట్రాక్టర్లు నాసిరకంగా నిర్మిస్తూ ఉండడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారులకు ఆర్థిక స్థోమత లేక కొన్ని గ్రామాల్లో కొందరు లబ్ధిదారులు ప్రభుత్వం ఇచ్చే రూ. 5 లక్షలతోనే ఇళ్లు నిర్మించుకుంటున్నారు. తక్కువ ఖర్చుతో ఇళ్లు నిర్మిస్తామని కాంట్రాక్టర్లు లబ్ధిదారులను ఒప్పించి ఇదే అదునుగా చూసి పనుల్లో నాణ్యత పాటించడం లేదు. మండల పరిధిలోని బీజీ.కొత్తూరు, సీతారాంపురం గ్రామాల్లో ఇళ్లు నాసిరకంగా నిర్మిస్తుండటం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే స్లాబ్‌లెవల్ వరకు నిర్మాణాలు పూర్తవగా నాణ్యత లేక భీములు, పిల్లర్లు పగిలిపోతున్నాయి. డబ్బుకు కక్కుర్తి పడి కాంట్రాక్టర్లు నాసిరకంగా నిర్మించడం పై లబ్ధిదారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లు నాసిరకంగా ఉన్నాయని సామాజిక మాధ్యమాల్లో రావడంతో కొన్ని ఇళ్లకు కాంట్రాక్టర్లు గుట్టుచప్పుడు కాకుండా మరమ్మతులు చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్లను నాణ్యతను పరిశీలించి కాంట్రాక్టర్లను హెచ్చరించాలని, ఇళ్లను నాణ్యతతో నిర్మించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

కట్టి నెలయినా కాలేదు..

మణుగూరు టౌన్: మున్సిపాలిటీలో పబ్లిక్ హెల్త్ విభాగం నిధులతో నిర్మించిన సైడ్‌డ్రైన్ నాసిరకంగా కట్టడంతో కట్టి నెలరోజులైన కాకముందే సోమవారం కూలింది. కళ్లముందే ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నా అలసత్వంగా వ్యవహరించిన అధికారుల పనితీరును కూలిన నిర్మాణం వెక్కిరిస్తోంది. ఉదయం కురిసిన వర్షానికి శివలింగాపురం కట్టదిగువన రామాలయం నుంచి రూ.32 లక్షల వ్యయంతో ఇటీవల కట్టిన సైడ్ డ్రైన్ పూర్తిగా కూలి మురుగునీరు కూలిన కట్టడంపై నుంచి ప్రవహించింది. కట్టడాలపై వచ్చిన ఫిర్యాదులను పర్యవేక్షిస్తున్నాం పరిశీలిస్తున్నాం అంటూ హడావుడి చేసిన అధికారుల తీరుపై ప్రజలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. నెలయినా గడవక ముందే కూలిపోవడం సదరు కాంట్రాక్టర్ నాణ్యతకు ఇచ్చిన ప్రాధాన్యతకు ప్రజాధనం దుర్వినియోగమవుతున్న తీరుకు అద్దం పడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.


కూలిన సైడ్ డ్రైన్

దుమ్ములేపుతున్నాయి..

ఇసుక లారీలతో నరకయాతన

- జనానికి ఇక్కట్లు, శ్వాసకోశ సమస్యలు
- గోతుల్లో నింపిన మట్టితో బురదమయం
- పర్ణశాలకు తగ్గిన భక్తుల తాకిడి



ఇసుల లారీలతో పైకి లేస్తున్న దుమ్ము

దుమ్ముగూడెం: మండలంలోని రోడ్లపై వెళ్తున్న ఇసుక లారీలతో పైకి లేస్తున్న దుమ్ముధూళితో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అసలే గోతులమయంగా ఉన్న రోడ్లపై ఇసుక లారీలు వందలాదిగా వస్తుండటంతో భద్రాచలం నుండి దుమ్ముగూడెం వరకు ప్రయాణం చేయాలంటేనే ప్రాణాలుపోయేలా ఉన్నాయి. ప్రధాన రహదారి అంతా భారీ ఎత్తున గోతులుగా మారి రవాణాకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. ములకపాడు దగ్గర పడిన భారీ గోతిలో అధికారులు ఎర్రమట్టితో నింపడంతో వర్షం పడినప్పుడు బురదమయంగా ఎండకు ఎండి ఆ దుమ్ము పైకి లేచి ములకపాడు సెంటర్ వాసులను తీవ్రఇబ్బందుల్లో పడేస్తోంది. ములకపాడు సెంటర్‌లో పైకి లేస్తున్న దుమ్ముతో ముఖానికి మాస్కులు పెట్టుకుని తిరగాల్సిన పరిస్థితులు కనపడుతున్నాయి.

శ్వాసకోశ సమస్యలు తప్పేలా లేవు

భద్రాచలం–దుమ్ముగూడెం ప్రధాన రహదారి మీద ప్రయాణించే ఇసుక లారీలతో దుమ్ముతో ప్రజలకు రానున్న కాలంలో శ్వాసకోశ సమస్యలు వచ్చేలా ఉన్నాయి. ఇసుక లారీలు ఒకదాని వెనుక ఒకటి పదుల సంఖ్యలో వెళ్తుండటంతో పాటు ఇతర వాహనాలు ప్రయాణించే సమయంలో దుమ్ముధూళితో దుకాణదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో మండలవాసులు శ్వాసకోశ వ్యాధి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ఉందా లేదా ప్రాణాలు తీసేందుకు ఉందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రతిపక్షాలు, ప్రజల నిరసనలు..

రోడ్లు మరమ్మతులు నిర్వహించే వరకు ఇసుక లారీలను నిలిపివేయాలని పలు దపాలుగా మండలంలోని ప్రతిపక్ష పార్టీలు, ప్రజలు నిరసనలు వ్యక్తం చేసినా, వినతులు అందజేసినా అటు ప్రభుత్వం కానీ ఇటు అధికార యంత్రాంగం కానీ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రోడ్డంతా గోతులమయంగా మారి ప్రాణాలు పోయే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క ఇసుక లారీలను యథేచ్ఛగా నడుపుతుండగా, కనీసం రహదారి మరమ్మతులు చేయాలనే ఆలోచన కూడా ప్రభుత్వం, అధికారులకు రాకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. రోడ్లు మరమ్మతులు చేయకుండా ఇలానే ఇసుక లారీలను ఇష్టారీతిన ప్రజలను ఇబ్బంది పెడుతూ ఇసుక రవాణా కొనసాగిస్తే ప్రజాగ్రహం తప్పదని నాయకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


బురదమయంగా మారిన రోడ్డు

వెలవెలబోతున్న పర్ణశాల..

దక్షిణఅయోధ్యగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి అనుబంధ ఆలయంగా ఉన్నా పర్ణశాలకు భద్రాచలం నుండి పర్ణశాల వరకు అధ్వానంగా ఉన్న రహదారులతో భక్తుల తాకిడి చాలా వరకు తగ్గింది. భద్రాచలం నుండి పర్ణశాలకు 30 నిమిషాలు పట్టే సమయంలో ప్రస్తుతం ఏర్పడిన గోతుల వలన గంటన్నర పడుతుండటంతో పాటు రహదారి అంతా ప్రమాదకరంగా ఉండటంతో భక్తుల తాకిడీ కూడ బాగా తగ్గింది. ఇంతకు ముందు శని, ఆదివారాలు, పండుగ సమయాల్లో కిటకిటలాడే పర్ణశాల ఆలయం ఈ రహదారుల వలన ప్రస్తుతం వెలవెలబోతుందని పర్ణశాల ఆలయ ప్రాంగణంలో దుకాణాలు నిర్వహించే దుకాణాదారులు తెలుపుతున్నారు. రోడ్డుమొత్తం భారీ గోతులు ఏర్పడటంతో ప్రమాదాలు జరుగుతాయనే భయంతో భక్తులు పర్ణశాల ఆలయానికి రావడానికి భయపడుతున్నారని ఆటో డ్రైవర్లు తెలుపుతున్నారు.

ప్రాణాలు పోయేలా ఉన్నాయి...



భద్రాచలం నుండి దుమ్ముగూడెం మండలం వరకు ప్రయాణం చేయాలంటేనే ప్రాణాలు పోయేలా ఉన్నాయి. అడుగుకో గుంతతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పాటు ఇసుక లారీల కారణంగా ప్రజలు రహదారిపై ప్రయాణం చేయాలంటే భయపడుతున్నారు. ఇప్పటికై నా అధికారులు, ప్రభుత్వం స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలి.

– రావులపల్లి పృథ్వీ, బీఆర్‌ఎస్ నాయకుడు

ఎన్నిసార్లు చెప్పినా అంతే...



భద్రాచలం డివిజన్‌లో రహదారి అంతా గోతులమయంగా మారి ప్రజల ఇబ్బందులపై ప్రతిపక్షాలు, ప్రజలు ఆందోళనలు చేసినా ప్రభుత్వం, అధికారులకు పట్టడం లేదు. ఇసుక లారీలను వెంటనే నిలిపివేసి రహదారి మరమ్మతులు చేపట్టకపోతే ప్రజాగ్రహం తప్పదు. అన్ని పార్టీలను ఏకం చేసి రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తాం.

– బొల్లోజు వేణు, సీపీఐ మండల కార్యదర్శి

గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి


ధర్నా నిర్వహిస్తున్న ఆదివాసీ గిరిజనులు

పినపాక: మారుమూల గ్రామాలకు రోడ్ల సౌకర్యం కల్పించాలని గిరిజన సంఘాల ఆధ్వర్యంలో గిరిజనులు సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆస్పత్రులకూ నడుచుకుంటూ వెళ్తున్నానమని, గర్భిణులు, బాలింతలను డోలీలాగా మోసుకొని నాలుగైదు కిలోమీటర్లు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారులు నిర్మిస్తున్నామని ప్రభుత్వం హామీలు ఇవ్వడం తప్ప ఇప్పటికీ నెరవేర్చిన దాఖలాలు లేవన్నారు. తక్షణమే రోడ్లు నిర్మించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మల వెంకన్న, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, గిరిజనలు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణం పూర్తిచేయాలి


ఐటీడీఏ పీవో రాహుల్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పంచాయతీ పరిధిలోని జగదీష్ కాలనీలో అసంపూర్తిగా ఉన్న కల్వర్టు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ఐటీడీఏ పీవో రాహుల్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుతూ... జగదీష్ కాలనీ, ఎంపీ కాలనీల మధ్యలో కల్వర్టు నిర్మాణం చేపట్టి ఆరునెలలు గడుస్తున్న నేటికీ పూర్తి కాలేదని ఆ మార్గంలో నడిచే పిల్లలు, పెద్దలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్పందించిన ఐటీడీఏ పీవో రాహుల్ స్వయంగా కల్వర్టును పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబోజి రత్నం, సోయం జోగారావు, బేతం దిలీప్‌కుమార్, నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే ఆందోళనలు


మాట్లాడుతున్న నాయకులు

మణుగూరు రూరల్: మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఆందోళనలు చేస్తామని సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం పార్టీ నాయకులు శివలింగాపురం గ్రామంలో పర్యటించి డ్రెయినేజీలను పరిశీలించారు. భారీ వర్షాలకు గాంధీబొమ్మ సెంటర్‌లో ఇటీవల నిర్మించిన డ్రెయినేజీ కూలిపోవడంపై కాంట్రాక్టర్, అధికారుల పర్యవేక్షణ లోపంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు నిర్వహిస్తున్నాడన్నారు. ఆదర్శనగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు, మటన్ – చేపలమార్కెట్ వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు నాసిరకంగా, అస్తవ్యస్తంగానే కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికై నా అధికారులు అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్‌వి.నాయుడు, తోట రమేష్, వేర్పుల నరేష్, ఆదర్ల రాములు, ప్రవీణ్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జీఎంకు సన్మానం


జీఎంను సన్మానిస్తున్న అధికారులు

మణుగూరు రూరల్ : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో జీఎం(హెచ్‌ఆర్‌డి) టి వెంకటరామరెడ్డి సోమవారం పర్యటించారు. ఈ నెలలో పదవీ విరమణ పొందనున్న ఆయన్ని ఏరియా జీఎం దుర్గం రామచందర్ జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. అనంతరం జీఎం రామచందర్ మాట్లాడుతూ... వెంకటరామరెడ్డి సింగరేణి సంస్థలో వివిధ ఏరియాలో విభిన్న హోదాల్లో పని చేసి సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం బి.శ్రీనివాసచారి, అధికారులు శ్రీనివాస్, సిహెచ్.రాంబాబు, ఎం.అనురాధ, శివప్రసాద్, దయాకర్, రామకృష్ణ, ఎస్.ప్రవీణ్‌కుమార్, నాగరమేష్, నాగేశ్వరరావు, బాబుల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ సీఈఓకు..


సీఈఓను సన్మానిస్తున్న సొసైటీ సిబ్బంది

మణుగూరు రూరల్ : మండలంలోని మణుగూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సీఈఓగా పనిచేస్తూ బదిలీపై పినపాక సొసైటీకి వెళ్తున్న సీఈఓ జ్ఞానదాసును సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, డైరెక్టర్లు, సిబ్బంది సోమవారం సంఘ కార్యాలయ ఆవరణలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా బదిలీపై మణుగూరు సొసైటి కార్యాలయానికి వచ్చిన సీఈఓ సునీల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సూపర్‌వైజర్ చంద్రమౌళి, సొసైటీ డైరెక్టర్లు పిన్నమనేని మాధవి, గుండగాని నాగేశ్వరరావు, ఉడతానేని రవి, గుమ్మల రాంబాబు, దాచేపల్లి శంకర్, సిబ్బంది, తాజుద్దీన్, గుంటుపల్లి రాఘవులు, శివ సతీష్ పాల్గొన్నారు.

తోటి గార్డులకు చేయూత


ఆర్థికసాయం అందజేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. కుటుంబ పెద్దలను కోల్పోయిన తోటి గార్డుల కుటుంబాలకు సోమవారం ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు. ఇటీవల గార్డులు రాజనర్సు, విశ్వేశ్వరరావుల తండ్రి మాటేటి నరసయ్య, మరోగార్డు రమేశ్‌బాబు తల్లిదండ్రులు ఇద్దరు వారం రోజుల వ్యవధిలోనే అనారోగ్యంతో మరణించారు. దీంతో ఒక్కో కుటుంబానికి రూ.32,800 చొప్పున పర్మినెంట్ గార్డుల చేతుల మీదుగా సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ అధికారులు, సూపర్‌వైజర్లు రామవతార్, సుధాకర్, రబ్బానీ, గార్డులు పాల్గొన్నారు.

పినపాక: మండలపరిధిలోని మల్లారానికి చెందిన పూణెం శంకర్, లలిత, రామకృష్ణ, కార్తిక్‌ల తల్లిదండ్రులు చనిపోయి బాబాయి దగ్గర ఉండటంతో పిల్లల పోషణకు బీఆర్‌ఎస్ నాయకుడు పాలిశెట్టి సత్తిబాబు ఆర్థికసాయం, 25 కేజీల బియ్యం నిత్యావసర సరకులు అందజేశారు. వారి చదువులకు పార్టీ తరపున పూర్తి సహాయసాకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.

ఉచిత కంటి వైద్యశిబిరం


మహిళను పరీక్షిస్తున్న వైద్యాధికారి సంజీవరావు

కరకగూడెం: మండలంలోని కొత్తగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కాలేజ్, లయన్స్ క్లబ్ భద్రాచలం సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యబృందం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ జి.సంజీవరావు పర్యవేక్షణలో 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 60 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సొసైటీ నిర్వాహకులు, డాక్టర్ కాంతారావు, రాజిరెడ్డి, ఆదినారాయణ, సూర్యనారాయణ, గ్రామస్తులు గొగ్గల నారాయణ, ఈసం సమ్మయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిమ్మచీకట్లో ప్రధాన రహదారి


వీధి దీపాలు లేని మణుగూరు - ఏటూరునాగారం ప్రధాన రహదారి


వెలగని వీధిలైట్

- అటకెక్కిన సెంట్రల్ లైటింగ్ పనులు
- రాత్రి వేళల్లో ప్రయాణం నరకం

పినపాక: మణుగూరు– ఎటూరునాగారం ప్రధాన రహదారి చిమ్మచీకటిలో మగ్గిపోతోంది. ఎస్‌హెచ్ రహదారి, మధ్యలో భద్రాద్రి పవర్‌ప్లాంట్ నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతున్న అభివృద్ధి శూన్యంగా మారింది. రాత్రి వేళల్లో విద్యుద్దీపాలు లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే రేగా కాంతారావు భద్రాద్రి పవర్ ప్లాంట్ అధికారులతో మాట్లాడి వారి నిధుల నుండి సెంట్రల్ లైటింగ్ కోసం రూ.3 కోట్లు మంజూరు చేయించారు. మణుగూరు నుండి జానంపేట వరకు, బయ్యారం క్రాస్ రోడ్ నుండి పినపాక హెడ్ క్వార్టర్ వరకు సెంట్రల్ లైటింగ్ కోసం నిధులు మంజూరు చేయించారు. పనులు ప్రారంభించిన అనతికాలంలోనే అవి అటకెక్కాయి. కొన్నిచోట్ల స్తంభాలు, వైర్లు, లైట్లు ఏర్పాటు చేసిన అవి వెలగని పరిస్థితి నెలకొంది.

ప్రయాణికులకు ఇక్కట్లు..

రాత్రి వేళల్లో మణుగూరు నుండి ఏటూరునాగారం వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ద్విచక్రవాహనదారులు, ఆటో డ్రైవర్లు, కార్లు వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న భారీ వాహనాల ఎల్‌ఈడీ లైట్లు కళ్లల్లో పడి రోడ్లు సరిగా కనపడక ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఎదురుగా వస్తున్న భారీ వాహనాల లైట్లు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. సింగిల్ రోడ్డు కావడం, రోడ్లపై లైట్లు లేకపోవడం దీనికి ప్రధాన కారణం.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి



మణుగూరు– ఏటూరునాగారం ప్రధాన రహదారిలో రాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎదురుగా వస్తున్న వాహనాల ఎల్‌ఈడీ లైట్లు కళ్లల్లో పడటంతో ప్రమాదాలకు గురవుతున్నాం. అధికారులు స్పందించి రహదారి వెంట వీధిలైట్లు ఏర్పాటు చేయాలి. – నాసరయ్య, ద్విచక్ర వాహనదారుడు

లైటింగ్ పనులు పూర్తి చేయాలి



పవర్ ప్లాంట్ నిధులతో ప్రారంభించిన సెంట్రల్ లైటింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి. అధికారులు పాలకులు స్పందించి వీటిపై అధికారులతో మాట్లాడి పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలి. రాత్రి సమయంలో నడుచుకుంటూ రోడ్లపైకి రావాలంటే భయానక పరిస్థితి ఏర్పడింది.

– నరేష్, సాంబయ్యగూడెం